

చుక్కల వరుసలు పెట్టి..
సక్కని ముగ్గులు కట్టి..



సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గులు వేసి మహిళలు మురిసిపోయారు. భోగి మంటలు, చిన్నపిల్లల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సాక్షి ఆధ్వర్యంలో సుభాష్‌నగర్ డివిజన్ అపురూపకాలనీ టీవీఆర్ మోడల్ హైస్కూల్ సౌజన్యంతో బుధవారం ముగ్గుల పోటీల్లో పోటాపోటీగా మహిళలు వివిధ రకాల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు.. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40 మంది పాల్గొన్న ఈ వేడుకల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన ఈ సంక్రాంతి ముగ్గుల పోటీలు మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిశాయి.

– కుత్బుల్లాపూర్/జీడిమెట్ల

రంగురంగుల ముగ్గులు...



హరితకు మొదటి బహుమతి అందజేస్తున్న స్కూల్ డైరెక్టర్ వంశీకృష్ణ



కె.శిరీషకు ద్వితీయ బహుమతి అందజేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు తివారి పండిట్



టీవీఆర్ మోడల్ హైస్కూల్ ఆవరణలో ముగ్గులతో నింపేసిన మహిళలు







సాక్షి ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల్లో బహుమతులు పొందిన మహిళలు

విజేతలు వీరే...

పోటాపోటీగా జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి హరిత, రెండో బహుమతి కే.శిరీష మూడో బహుమతి రూపశ్రీ, ఏ.శిరీష ఇద్దరికీ చీరలు అందజేశారు. వీరికి స్కూల్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు తివారీ పండిట్, ఉమా, సాక్షి ప్రతినిధులు బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలో న్యాయనిర్ణేతలుగా సావిత్రి, అర్చన, పుష్పలత వ్యవహరించారు. ఏర్పాట్లను పీఈటీ లక్ష్మణ్ పర్యవేక్షించారు. స్కూల్ హెడ్ గర్ల్ యోగితా బాటి తోటి విద్యార్థులు కలిసి ముగ్గులు వేసే విషయం లో మహిళలకు సహకరించారు.

టీవీఆర్‌లో సంక్రాంతి శోభ..

ఉదయం నుంచి టీవీఆర్ మోడల్ హైస్కూల్ ఆవరణ మొత్తం పండుగ వాతావరణం కలిగింది. ఒక వైపు విద్యార్థుల నృత్యాలు, మరోవైపు భోగి మంటలు ఏర్పాటు చేసి విద్యార్థులకు పండుగ ఆవశ్యకతను వివరించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో మహిళలు వేసిన ముగ్గులను టీవీఆర్ సంస్థల అధినేత కోటిరెడ్డి పరిశీలించారు.



పాఠశాల ఆవరణలో వేసిన భోగిమంట



సంక్రాంతి వేడుకల్లో సందడి చేస్తున్న చిన్నారులు

భువిపై మెరిసిన హరివిల్లులు



రూపశ్రీకి తృతీయ బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయురాలు ఉమ



ఏ.శిరీషకు తృతీయ బహుమతి అందజేస్తున్న సాక్షి ప్రతినిధులు

క్లుప్తంగా

హెచ్ఎంటీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్: హెచ్ఎంటీ కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం ఆయన చింతల్ హెచ్ఎంటీ కార్యాయంలో సంస్థ సీఎండీ పంకజ్ గుప్తాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కార్మికుల జీతాలు పెండింగ్‌లో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కంపెనీలో ఉత్పత్తులకు అవసరమయ్యే వర్కింగ్ క్యాపిటల్, కొత్త నియామకాలపై ప్రత్యేక చొరవ చూపి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు 5 సంవత్సరాల నుంచి పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, సెటిల్‌మెంట్ అలవెన్స్‌లు నిలిపివేయడంతో రిటైర్డ్ ఉద్యోగులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించారు.

ఓబన్న సేవలు చిరస్మరణీయం

దుండిగల్: వడ్డెర కులస్తుల సంక్షేమానికి ఓబన్న చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి కూనమహాలక్ష్మినగర్‌లో వడ్డే ఓబన్న జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనారోగ్య సమస్యతో ఆపరేషన్ చేయించుకున్న కార్పొరేటర్ సురేష్ రెడ్డిని బుధవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పరామర్శించారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలు అందిస్తాం

- ఆస్పత్రి కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం అత్యాధునిక వైద్య సదుపాయాలతో అరుంధతి ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని అరుంధతి ఆస్పత్రి కార్యదర్శి, బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అరుంధతి ఆస్పత్రిలో జర్నలిస్టులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 70 మంది జర్నలిస్టులకు గుండె, లివర్, కిడ్నీ లకు సంబంధించి 2డీ ఎకో, ఈసీజీ, అల్ట్రా స్కానింగ్‌లతో పాటు 20 రకాల పరీక్షలు చేశారు. అనంతరం సంబంధిత వైద్యులు పరీక్షించి తగిన సూచనలు చేశారు.

మోసం చేయడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: వడ్డీ లేని రుణాల ఇస్తామని 2018లో గద్దెనెక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వం డ్వాక్రా గ్రూపు సంఘాలను మరిచిపోయిందని.. వారికి వడ్డీలకు రుణాలు ఇచ్చి చక్రవడ్డీ వసూలు చేస్తున్నారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లో ఆయన నివాసం వద్ద 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. ప్రతి అంశంలో ప్రజలను మోసం చేయడంలో సీఎం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఘాటుగా విమర్శించారు. అబద్ధాలను నిజాలుగా నమ్మించే మంత్రులు ఉన్నంత కాలం తెలంగాణలో నిరుద్యోగ యువత ఇబ్బందులు పడాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా నగరానికి వస్తున్నారంటేనే ప్రభుత్వానికి దడ పుడుతోందని అన్నారు. రాబోయే రోజుల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటాయని పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణలో జెండా ఎగురవేయడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ ఏ విధంగా కనుమరుగు అయ్యిందో.. అదే విధంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కూడా కనుమరుగు కావడం ఖాయమని జోశ్యం చెప్పారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిల్లో మొత్తం 4800 గ్రూపులు ఉండగా వడ్డీ లేని రుణాలు ఇవ్వకపోవడం మూలంగా 1300 గ్రూపులు కనుమరుగు అయ్యాయని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఏ మొహం పెట్టుకొని మహిళా గ్రూపు సంఘాలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ప్రతి గ్రూపు మహిళ తప్పకుండా టీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు.

◆ మూడు నెలలుగా పోలీసు ఉద్యోగులకు సరెండర్ అమౌంట్, టీఏ, డీఏలు కూడా రావడం లేదన్నారు. గతేడాది పెంచిన డీఏ అమౌంట్ బేసిక్ పే సంవత్సర కాలంగా కాలయాపన చేస్తూ యాడ్ చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా పోలీసు ఉద్యోగులు కళ్లు తెరవాలని శ్రీశైలంగౌడ్ కోరారు.

భవనంపై నుంచి జారి పడి పెయింటర్ మృతి



నరేందర్‌కుమార్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట శ్రీనివాస్‌నగర్‌కు చెందిన నరేందర్‌కుమార్ (60) వృత్తిరీత్యా పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కొంపల్లి ఓని బిగ్‌బజార్ వెనుక ఉన్న కేశవ బాయిస్ హాస్టల్ భవనంలోని 3వ అంతస్తులో పెయింటింగ్ వేస్తుండగా జూలు తెగడంతో నరేందర్‌కుమార్ కింద పడ్డాడు. అతని తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

మహిళ అదృశ్యం

జగద్గిరిగుట్ట: అమ్మ గుర్తుకు వస్తోందంటూ ఇంట్లో నుంచి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్విన్ కాలనీ పరిధి ధరణి కాలనీకి చెందిన సౌందర్య (26), కెవిన్ భాషాకు పెద్దలను ఎదిరించి గత నెలలో ప్రేమ వివాహం చేసుకున్నామన్నారు. అయితే ఈనెల 9వ తేదీన సౌందర్య కనిపించకుండా పోయింది. తనకు అమ్మగుర్తుకు వస్తోందని తన భార్య ఏడ్చేసిందని, ఇంట్లో ఎవరికి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయిందని బాషా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగిన మైకంలో ఉరేసుకుని యువకుడి మృతి

జగద్గిరిగుట్ట: తాగిన మైకంలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం దేవేందర్‌నగర్‌కు చెందిన రామకృష్ణ, భారతిలు కూలి పనుల చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 10వ తేదీన ఉదయం భార్యాభర్తలు, చిన్నకుమారుడు పనిపై బయటకు వెళ్లగా ఇంట్లో పెద్దకుమారుడు శ్రీకాంత్ (24) ఒక్కడే ఉన్నాడు. సాయంత్రం 5 గంటలకు భారతి పని ముగించుకుని ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా పెద్ద కుమారుడు చీరలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. చుట్టు పక్కల వాళ్ల సహాయంతో అతన్ని కిందకు దింపి సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మద్యానికి బానిసైన తన కుమారుడు అప్పుడప్పుడు వింతగా ప్రవర్తిస్తాడని, మద్యం మత్తులో ఉరి వేసుకున్నాడని భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిట్టీ పార్టీపై పోలీసుల ఆకస్మిక దాడి

కుత్బుల్లాపూర్: అర్ధరాత్రి హోరెత్తిన ఆర్కెస్ట్రాతో కిట్టీ పార్టీ చేసుకుంటూ ఎలాంటి పర్మిషన్ లేకుండా విచ్చలవిడిగా మద్యం తాగుతున్న ఫంక్షన్‌హాల్‌పై పేట్‌బషీరాబాద్ పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కొంపల్లిలోని జాతీయ రహదారి దగ్గరలో ఉన్న ఎస్ఎస్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం అర్ధరాత్రి కొందరు కిట్టి పార్టీ నిర్వహించుకుంటున్నారు. పార్టీలో భాగంగా మితిమీరిన సౌండ్‌తో ఆర్కెస్ట్రా ఏర్పాటు చేయడంతో స్థానికంగా ఉన్న కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల తనిఖీకి వెళ్లగా డీజే సౌండ్‌తో, ఆర్కెస్ట్రా నిర్వహిస్తున్నట్లు, అదే విధంగా సిట్టింగ్ ఏర్పాటు చేసి భారీ ఎత్తున మద్యం సరఫరా చేసినట్లు గుర్తించారు. బోయినపల్లికి చెందిన నిర్వాహకుడు పవన్‌కుమార్‌తో పాటు ఆర్కెస్ట్రా బృందం సాయి కుమార్, బాబురావు, రోహన్, జస్వంత్, రఘువీర తదితరులతో పాటు ఫంక్షన్‌హాల్ ఓనర్ సదా నరసింహారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రశాంత్ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం సరఫరా, ఆర్కెస్ట్రా ఏర్పాటు, న్యూసెన్స్ తదితర అంశాలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కిట్టీ పార్టీలో ప్రముఖులు..

ఇకపోతే అర్ధరాత్రి సమయంలో పోలీసులు మెరుపు దాడి చేసిన కిట్టి పార్టీలో అందరూ ప్రముఖులే ఉన్నట్లుగా తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు, వారి బంధువులు, మిత్రులతో పాటుగా మరికొందరు విపక్ష పార్టీల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నట్లు సమాచారం.

విరాళం



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌కు చెందిన త్రివేణి ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో కిషాన్ అండ్ జవాన్‌ల సహాయార్థం రూ.1,01116 చెక్కును బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైను కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో త్రివేణి విద్యా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు ఉన్నారు.

చీరల పంపిణీలో జర్మనీ బృందం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప సంక్షేమ సంఘం భవనంలో బుధవారం చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో పేదలకు చీరలు, నిత్యవసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి శంషాబాద్‌కు చెందిన చైతన్య మహిళా మండలి సభ్యులతో పాటు జర్మనీకి చెందిన ఏడుగురు ప్రతినిధుల బృందం హాజరై 50 మంది చీరలు అందజేశారు.

గెలిపిస్తే పదోన్నతులు, బదిలీల సమస్యను పరిష్కరిస్తా

పీఆర్టీయూ–టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి

దుండిగల్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు పీఆర్టీయూ–టీఎస్ కృషి చేస్తోందని ఆ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం దుండిగల్–గండిమైసమ్మ మండలంలోని కొంపల్లి, దూలపల్లి, బహదూర్‌పల్లి, దుండిగల్, గాగిల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ... పీఆర్టీయూ–టీఎస్ 52 ఏళ్లుగా ఉపాధ్యాయ లోకానికి ఎనలేని సేవలందిస్తోందన్నారు. నేడు 75 వేల సభ్యులు కలిగిన అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా మారిందని పేర్కొన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఏడు సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్‌తో పాటు పదోన్నతులు, బదిలీలు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామేశ్వర్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి, దుండిగల్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముదావత్ రవీందర్, నాయిని చంద్రశేఖర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నకేశవరెడ్డి

స్వామి వివేకానంద స్ఫూర్తి

సమాజ సేవే పరమావధి



"ప్రయత్నం చేసి ఓడిపో.. కానీ ప్రయత్నం చేయడంలో ఓడిపోకు"అంటూ నిరాశలో మునిగిపోయిన వారిని మేల్కొలుపుతూ స్వామి వివేకానంద చేసిన ప్రసంగాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయి. జీవితంలో ఏదో సాధించాలని ప్రయత్నించి ఓడిపోయి జీవితంపై విరక్తి చెందిన యువతకు "కెరటం నాకు ఆదర్శం.. లేచి పడుతున్నందుకు కాదు.. పడినా లేస్తునందుకు"అంటూ వారిలో బతుకుపై ఆశను పుట్టిస్తూ ఆయన చెప్పిన మాటలు సదా అనుసరణీయం. స్వామి వివేకానంద మన మధ్య లేకున్నా, అయిన చేసిన ప్రసంగాలు ఎప్పటికీ చిరంజీవిగా నిలిచిపోతాయి. అందుకే ఆయిన జయంతి (జనవరి 12వ తేదీ)ని నేషనల్ యూత్ డేగా నిర్వహించుకుంటున్నారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ఎందరో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఒకటి. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.

రంగారెడ్డినగర్: స్వామి వివేకానంద స్ఫూర్తితో 2022లో 15 మంది యువకులతో ఏర్పడిన స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ సమాజ సేవే పరమావధిగా ముందుకు సాగుతోంది. గాంధీనగర్‌కు చెందిన స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జిల్లా లక్ష్మినాథ్ నేతృత్వంలో ఉపాధ్యక్షుడు రంగాసాయిగౌడ్, కార్యదర్శి తిమ్మయ్య, సభ్యులు వెంకటసాయి నవీన్, శ్రీధర్, విజయ్, నాగరాజు, మురళి, ఆంజనేయులు, సంపత్, సందీప్, శ్రీను, కిరణ్, ఆనంద్‌లు సమిష్టిగా సేవా కార్యక్రమాలు చేపడుతూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

◆ 52 ఉచిత వైద్య శిబిరాలు, 16 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు కరోనా విపత్కర సమయంలో 50 రోజులల పాటు నిరాటకంగా నిరుపేదలకు, ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన వలస ప్రజలకు నిత్యవసరాలను అందజేసి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత..

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో ఉచితంగా నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు అందించడంతో పాటు వారిలో దేశభక్తి, సామాజిక స్పృహ కలిగించడం కోసం వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నాయి.

సేవలకు గుర్తింపుగా అవార్డులు..

◆ 2013లో ఏపీఎస్ఏపీ నుంచి ఉత్తమ యువజన సంఘం అవార్డు



వయోవృద్ధులు, దివ్యాంగులకు నిత్యవసరాలు, పండ్లు అందజేస్తున్న స్వామి వివేకానంద్ యూత్ అసోసియేషన్ సభ్యులు (ఫైల్)



సామాజిక సేవకు అవార్డు అందుకుంటున్న స్వామి వివేకానంద్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా లక్ష్మీనాథ్ (ఫైల్)

◆ 2014లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సమాజ సేవ రంగం అవార్డు

◆ కరోనా సమయంలో చేసిన సేవలకు గాను 2021లో శిఖరం ఆర్ట్స్ నుంచి నంది అవార్డు

సమష్టిగా వేడుకలు..

స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ సంక్షేమ సంఘం సహకారంతో గాంధీ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. అదే విధంగా బస్తీ అభివృద్ధిలో కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ పచ్చదనాన్ని పెంపొందించడానికి మొక్కలు నాటే కార్యక్రమం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నేటి తరానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. మొదట్లో 15 మందితో ప్రారంభమైన స్వామి వివేకానంద యువజన సంఘంలో ప్రస్తుతం 50 మంది సభ్యులుగా చేరి సమాజాభివృద్ధికి పాటు పడుతున్నారు.

నేడు రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం

స్వామి వికానందుడి 160వ జయంతి వేడుకలను పురస్కరించుకుని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ జీడిమెట్ల సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ కమ్యూనిటీహాలులో గురువారం రక్తదాన శిబిరం, డయాబెటిక్, ఆర్థో, కార్డియాక్ సమస్యలపై ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు జిల్లా లక్ష్మినాథ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 1.30 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.